## క్లుప్తంగా...

### సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంచుకోవాలి


హ్యాకథాన్‌లో విద్యార్థులు

ఘట్‌కేసర్: విద్యార్థులు సమకాలీన సాంకేతిక విప్లవానికి అనుగుణంగా ఎప్పటికప్పుడు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంపొందించుకోవాలని టీసీఎస్ చీఫ్ ప్రొడక్ట్ ఆఫీసర్ బాలప్రసాద్, టెక్ మహేంద్ర చీఫ్ అర్కిటెక్ అనిర్బన్‌పాల్ అన్నారు. వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీ(ఏయూ)లో కంప్యూటర్ సైన్స్, ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఆదివారం 36 గంటల ఎలైట్ హ్యాకథాన్‌ను వారు ప్రారంభించారు. కార్యక్రమంలో ఏయూ సీఈఓ నీలిమా, ఉప కులపతి రాంచంద్రం, రిజిస్ట్రార్ ఫాతిమా, డీన్ విజయ్‌కుమార్, విష్ణుమూర్తి, హెచ్‌ఓడీ శ్రీదేవి, సమన్వయ కర్తలు బలరాం, జ్యోతి, విద్యార్థులు పాల్గొన్నారు.

### ఘనంగా వార్షికోత్సవం


వేడుకలో మాట్లాడుతున్న ఏకే మురుగేష్


జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ బీజేఆర్‌నగర్‌లోని ఏకలవ్య పాఠశాల 20వ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కార్పొరేటర్ ఏకే మురుగేష్ హాజరై మాట్లాడుతూ.. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మక శక్తిని వెలికి తీయాలని, ఇందుకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కృషి చేయాలన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కార్పొరేటర్ పల్లపు రవి, మాజీ సైనికులు బీవీ ఇమ్మానియేల్, ప్రిన్సిపాల్ అరుణ్, కుతాడి మల్లేష్, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

### ఆత్మరక్షణకు కరాటే దోహదం


పతకాలు సాధించిన విద్యార్థులతో మాస్టర్ నరేందర్‌యాదవ్, గురు

జవహర్‌నగర్: ఆత్మరక్షణకు కరాటే దోహదం చేస్తోందని తైక్వాండో మాస్టర్ నరేందర్‌యాదవ్ అన్నారు. ఆదివారం చర్లపల్లిలోని ఆక్స్‌ఫర్డ్ పాఠశాలలో ఫస్ట్ తెలంగాణ రాష్ట్ర తైక్వాండో యూనియన్ చాంపియన్‌షిప్ పోటీలను నిర్వహించారు. కాప్రా మండపంలోని వివిధ పాఠశాలల విద్యార్థులు 16 మంది పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచారు. ఇందులో కావ్య, రాజీ, గృహిత, హితైషి, అక్ష, అక్షిత, ప్రగ్నేశ్వర్, సాయివంశీయాదవ్, సాయిఉదయ్‌రాజ్, రేవంత్‌గౌడ్, ఆకిల్ చక్రలకు స్వర్ణ పతకం, హర్షవర్ధన్, విశ్వతేజ, థామస్, ఇతేశ్వర్, విరాట్‌చారిలు సిల్వర్ మెడల్ సాధించారు. కార్యక్రమంలో మాస్టర్ గురు, తైక్వాండో యూనియన్ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### అలరించిన 'అక్విలా 2కే23'


కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడలోని సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాలలో అక్విలా 2కే23 పేరిట నిర్వహించిన అన్యువల్ డే అందరిని అలరించింది. కార్యక్రమంలో టీసీఎస్ చీఫ్ ఇన్నోవేషన్ ఆఫీసర్ బాలప్రసాద్, కాష్ మేనేజింగ్ డైరెక్టర్ గుమిడేల్ల శ్రీధర్‌లు పాల్గొని మాట్లాడుతూ.. విద్యార్థులు 5జీ టెక్నాలజీ పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రతీ విద్యార్థి సామాజిక అంశాలపై అవగాహన కలిగి ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌గా ఎదగాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల సంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. కళాశాల కార్యదర్శి టీవీ రెడ్డి, చైర్మన్ బాలారెడ్డి, డైరెక్టర్ సరోజారెడ్డి, అనురాగ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీలత, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి


రంగమ్మ (ఫైల్)

ఘట్‌కేసర్: ద్విచక్రవాహనాలు ఢీకొన్న ఘటనలో ఓ మహిళ అక్కడికక్కడే మరణించిన ఘటన ఘట్‌కేసర్ పీఎస్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. సీఐ అశోక్‌రెడ్డి వివరాలు ప్రకారం.. తుర్కయాంజాల్‌కు చెందిన రంగమ్మ(50) ఘట్‌కేసర్ మున్సిపాలిటీ కేఎల్లార్‌నగర్‌లో కుటుంబ సభ్యులతో కలిసి నివాసముంటుంది. భర్త శ్రీనివాస్‌రెడ్డితో ద్విచక్రవాహనం (ఏపీ10ఏహెచ్9591)పై ఉప్పల్‌లో షాపింగ్ చేసి ఇంటికి తిరిగి వస్తుండగా అన్నోజీగూడ ఎల్లా ఫుడ్ కోర్ట్ వద్ద వేగంగా, అశ్రద్ధగా వస్తూ గ్లామర్ బైక్(ఏపీ28బీఆర్0320) వెనక వైపు నుంచి ఢీకొట్టింది. దీంతో ఆమె రోడ్డుపై పడి తలకు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మరణించింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

# పది పర్సంటేజీపై ఫోకస్


## ప్రత్యేక బృందాలతో అంతర్గత మార్కులపై దృష్టి పెట్టిన జిల్లా విద్యా శాఖ

- ఏప్రిల్ 3 నుంచి 10వ తరగతి పరీక్షల నేపథ్యంలో చర్యలు
- విద్యార్థుల సామర్థ్యాల అంచనాకు 34 తనిఖీ బృందాలు
- త్వరలో ఆన్‌లైన్‌లో నమోదుకు కసరత్తు

సాక్షి,మేడ్చల్ జిల్లా: రాష్ట్రంలో ఏప్రిల్ 3వ తేదీ నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభంకానున్న నేపథ్యంలో విద్యాశాఖ ఉత్తీర్ణత శాతం పెంచడంపై ఫోకస్ పెట్టింది. ఇందులో భాగంగా పరీక్షల ప్రారంభానికి ముందు ప్రభుత్వ, ప్రైవేట్ బడుల్లో విద్యార్థులకు అంతర్గత మార్కులు నమోదు చేయాలని నిర్ణయించారు. కోవిడ్ తర్వాత పూర్తిస్థాయిలో తరగతులు నిర్వహిస్తుండటంతో.. ఈ అంతర్గత మార్కుల నమోదుపై విద్యాశాఖ దృష్టి పెట్టింది. ఈ నేపథ్యంలోనే మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థుల సామర్థ్యాలను అంచనా వేసేందుకు ఆ శాఖ ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో 34 బృందాలను ఏర్పాటు చేశారు. ఈ బృందాలు పాఠశాలలను సందర్శించి తనిఖీ చేస్తున్నాయి.

**కేటాయింపు ఇలా..**

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో మొత్తంగా 880 పాఠశాలలు ఉండగా.. ఇందులో 43,470 మంది పదో తరగతి విద్యార్థులు చదువుకుంటున్నారు. 105 ప్రభుత్వ బడుల్లో 7 వేల మంది విద్యార్థులు ఉండగా.. 772 ప్రైవేటు బడుల్లో 36,470 మంది ఉన్నారు. వీరంతా పదో తరగతి వార్షిక పరీక్షలను రాయబోతున్నారు. గతంలో 11 పేపర్లు ఉండగా ఈ సారి ఆరుకు కుదించారు. ప్రతి సబ్జెక్టుకు 100 మార్కులు ఉండగా 80కి వార్షిక పరీక్ష నిర్వహిస్తారు. మిగిలిన 20 మార్కులను నిరంతర సమగ్ర మూల్యాంకనం(సీసీఈ) విధానంలో భాగంగా.. నిర్మాణాత్మక మూల్యాంకన (ఫార్మెటివ్ అసెస్మెంట్), పరీక్షల ఫలితాలు, విద్యార్థులు రాసే నివేదికల ఆధారంగా అంతర్గత మార్కులను కేటాయిస్తారు. పదో తరగతి విద్యార్థి భవిష్యత్తుకు ఇవి కీలకంగా మారనున్నాయి. ఈ నేపథ్యంలో ఆయా మార్కుల నమోదుపై విద్యాశాఖ పారదర్శకంగా తనిఖీలు చేపడుతోంది. విద్యార్థులు చేసిన ప్రాజెక్టు వర్క్, చేతిరాత, ఫార్మెటివ్ అసెస్మెంట్(ఎఫ్ఏ) పరీక్షల్లో వచ్చిన మార్కులను బృందాలు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నారు. మార్చి మొదటి వారం కల్లా తనిఖీలతో పాటు ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ కూడా పూర్తయ్యేలా విద్యాశాఖ చర్యలు తీసుకుంటోంది.



**ప్రైవేట్ విద్యా సంస్థలపై...**

ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు అశాస్త్రీయంగా అంతర్గత మార్కులు నమోదు చేసే అవకాశం ఉండటంతో ప్రత్యేక బృందాలు ప్రత్యక్షంగా పరిశీలిస్తున్నాయి. ప్రభుత్వ, ప్రైవేటు బడుల్లో విద్యార్థులకు ఫార్మెటివ్ పరీక్షల్లో వాస్తవ మార్కులు వేశారా.. లేదా తనిఖీ చేస్తున్నారు. వివిధ అంశాలను చూసి లోపాలుంటే సరి చేసిన తర్వాత ఆన్‌లైన్‌లో నమోదు చేయనున్నారు.

**తప్పిదాలకు తావివ్వకుండా చర్యలు**

విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రైవేట్, ప్రభుత్వ బడుల్లో విద్యార్థులకు కేటాయించిన అంతర్గత మార్కులను ప్రత్యేక బృందాలతో తనిఖీ చేయిస్తున్నాం.త్వరలో ఆన్‌లైన్‌లో నమోదు చేస్తాం. తప్పిదాలకు తావివ్వకుండా విద్యార్థులందరికీ న్యాయం జరిగేలా యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది.

– ఐ.విజయకుమారి, డీఈఓ, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా

# రెండు మున్సిపాలిటీల అభివృద్ధికి కృషి

**మేడ్చల్ ఇన్‌చార్జి కమిషనర్ రాములు**



మేడ్చల్: మేడ్చల్, గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీల అభివృద్ధికి తన శాయశక్తుల కృషి చేస్తానని గుండ్లపోచంపల్లి కమిషనర్, మేడ్చల్ ఇన్‌చార్జి కమిషనర్ వి.రాములు అన్నారు. మేడ్చల్ కమిషనర్‌గా బాధ్యతలు తీసుకున్న సందర్భంగా ఆయన సాక్షితో మాట్లాడుతూ.. రెండు మున్సిపాలిటీలకు కమిషనర్ హోదాలో ప్రతీ రోజు అందుబాటులో ఉంటానని, పనిని బట్టి ఎక్కడ ఎక్కువ పని ఉంటే ఆ మున్సిపాలిటీలో ఎక్కువ సమయం కేటాయిస్తానన్నారు. ప్రతీ రోజు రెండు మున్సిపాలిటీలకు తప్పకుండా హాజరవుతానని, ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉన్నా తనను నేరుగా కలవాలని సూచించారు. మున్సిపాలిటీల్లో ఎలాంటి విమర్శలకు తావివ్వకుండా ఎలాంటి పక్షపాతాలు లేకుండా పని చేస్తానన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రతీ వార్డులో అమలు చేస్తామన్నారు. రాజకీయాలకు అతీతంగా పనిచేయడమే తన ధ్యేయమని, తాను ఎక్కడ పని చేసినా రాజకీయాల జోలికి వెళ్లనని పాలకులతో సమన్వయం చేసుకుంటూ ప్రాంతాలను అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని ఆయన అన్నారు.

### 'మన వారికే ఓటు వేసుకుంటే రాజ్యాధికారం మనదే..'

ఘట్‌కేసర్: మన ఓటు మన వారికే వేసుకుంటే రాజ్యాధికారం మనకే దక్కుతుందని ఎస్టీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు బిక్కునాయక్ అన్నారు. ఆదివారం పట్టణంలో నిర్వహించిన అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై అంబేడ్కర్‌కు పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో దాసు, నర్సింహ, బాలయ్య, రాములు, రాజేశ్, నర్సింగ్ రావు, నవీన్‌కుమార్, అంజయ్య, కష్ణ, వెంకటేశ్వర రావు, రూపేశ్, గణేశ్, వినోద్, భరత్ పాల్గొన్నారు.

### మాంసం విక్రయదారులకు నోటీసులు

పోచారం: కుక్కల నియంత్రణలో భాగంగా మాంసం విక్రయదారులకు పోచారం మున్సిపల్ చైర్మన్ కొండల్‌రెడ్డి ఆదివారం నోటీసులు అందజేశారు. కుక్కల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రజలు అప్రమత్తంగా ఉంటూ కుక్కల బెడదపై మున్సిపల్ అధికారులకు సమాచారం అందించాలని కోరారు.

### సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన

మేడ్చల్: సైబర్ నేరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని మేడ్చల్ పోలీసులు సూచించారు. పట్టణంలోని ప్రైవేట్ బీటెక్ హాస్టల్‌లో పోలీసులు అవగాహన కార్యక్రమాలు చేపట్టి నేరగాళ్ల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. విద్యార్థులు రోడ్డు భద్రతా నియమాలు తప్పకుండా పాటించాలని సూచించారు. సమావేశంలో ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

### నాగారంలో మదర్స ఆధ్వర్యంలో 'ఖురాన్ హిఫ్జ్'

కీసర: నాగారం మున్సిపాలిటీ మదర్సా మహమ్మదీయ తజ్విదూల్ ఖురాన్ ఆధ్వర్యంలో 7 మంది ముస్లిం పిల్లలు ఖురాన్ హిఫ్జ్ (కురాన్ చూడకుండా చదవడం) కార్యక్రమంలో నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి, వైస్ చైర్మన్ బండారి మల్లేష్‌యాదవ్, కౌన్సిలర్లు బిజ్జ శ్రీనివాస్, అన్నంరాజు శ్రీనివాస్, కోఆప్షన్ సభ్యుడు ఆదం షఫిక్, ఖాజా, ముస్లిం మత పెద్దలు, మదర్స చైర్మన్ మసూర్ అలంసాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

### ప్లేస్‌మెంట్ డ్రైవ్

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడలోని నర్సింహా రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. బహుళ జాతీయ సంస్థ జోహో ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొనగా నాలుగు దశల్లో నిర్వహించిన ఎంపిక ప్రక్రియలో ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారని, అందులో కళాశాలకు చెందిన వారే ఇద్దరు విద్యార్థులు ఉన్నట్లు తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన కళాశాల విద్యార్థులను కళాశాల చైర్మన్ నర్సింహా రెడ్డి, కార్యదర్శి త్రిశూల్‌రెడ్డి, ప్రిన్సిపాల్ లోకనాథం, ట్రెజరర్ త్రిలోక్‌రెడ్డి, డైరెక్టర్ మోహన్‌బాబు తదితరులు అభినందించారు.

### సీఎం సహాయ నిధిని సద్వినియోగం చేసుకోండి



ఘట్‌కేసర్: ముఖ్యమంత్రి సహాయ నిధిని పేదలంతా సద్వినియోగం చేసుకోవాలని మంత్రి మల్లారెడ్డి అన్నారు. అనారోగ్యం కారణంగా ఆస్పత్రిలో చికిత్స పొందిన ఘట్‌కేసర్ మున్సిపాలిటీకి చెందిన ఇద్దరికి మున్సిపల్ చైర్‌పర్సన్ పావనీయాదవ్‌తో కలిసి ఆదివారం సీఎంఆర్ఎఫ్ చెక్కులు మంత్రి అందజేశారు. పన్నెండో వార్డుకు చెందిన రాజేశ్‌కు రూ.1.25 లక్షలు, శ్రావణికి రూ.2.50 లక్షలు సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరయ్యాయి. కార్యక్రమంలో జంగయ్యయాదవ్, లబ్ధిదారులు ఉన్నారు.

**చౌదరిగూడలో...**

చౌదరిగూడ వెంకటాద్రిటౌన్‌షిప్‌కు చెందిన సోమాచారికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.23,500 చెక్కును సర్పంచ్ రమాదేవి, మాజీ సర్పంచ్ రాములుగౌడ్, బీఆర్ఎస్ మహిళా అధ్యక్షురాలు మంగతో కలిసి ఆదివారం అందజేశారు.

# డబుల్ ఇళ్లు పూర్తయి నాలుగేళ్లయినా నిరీక్షణే!

- పూర్తయినా పంపిణీ చేయకపోవడంతో కీసర ప్రజల్లో ఆందోళన
- తమ సొంతింటి కల నెరవేరేనా అంటూ వాపోతున్న లబ్ధిదారులు
- అసాంఘిక శక్తులకు అడ్డాగా డబుల్ బెడ్రూమ్ ఇళ్ల సముదాయాలు


కీసరలో 'డబుల్' ఇళ్ల సముదాయాల పరిస్థితి ఇలా..


కీసర: ఏళ్ల తరబడిగా నిరుపేదలు నిరీక్షిస్తూ వస్తున్న తమ సొంతింటి కల నెరవేరడం లేదని మండల కేంద్రమైన కీసరలో లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం అందజేస్తామన్న డబుల్ బెడ్రూం గృహ సముదాయాలు పూర్తయినప్పటికీ అధికారులు, పాలకుల నిర్లక్ష్యం కారణంగా తమకు ఇబ్బందులు తప్పడం లేదని వాపోతున్నారు. మండల కేంద్రమైన కీసరలో మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిరుపేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు అందజేసేందుకు జీప్లస్1 విధానంలో 6 బ్లాక్‌లో సుమారు 48 డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభించారు. గృహ సముదాయలు పూర్తయ్యి దాదాపు 4 ఏళ్ల పూర్తయినప్పటికీ ఇప్పటి వరకు లబ్ధిదారులను గుర్తించి ఇళ్లను పంపిణీ చేయలేదంటే పాలకులు, అధికారులు చిత్తశుద్ధి ఏ మేరకుందో అర్థం చేసుకోవచ్చు.

**అసాంఘిక శక్తులకు అడ్డాగా...**

నిర్మాణాలు పూర్తయ్యి ఏళ్లు గడుస్తున్న లబ్ధిదారులకు ఇళ్లు అందజేయకపోవడంతో డబుల్ బెడ్రూం ఇళ్లు అసాంఘిక శక్తులకు అడ్డాగా మారాయి. ముఖ్యంగా మందు బాబులు డబుల్ ఇళ్ల సముదాయాలను అడ్డాగా మార్చుకుని అక్కడ మద్యం సేవిస్తూ విచ్చలవిడిగా మద్యం సీసాలను పడేస్తున్నారు. మరో పక్క ఇళ్లకు సంబంధించి ఏర్పాటు చేసిన డోర్లు విరిగిపోవడంతో పాటు కిటికీల అద్దాలు పగిలిపోయాయి. గృహ సముదాయానికి వేసిన రంగులు పూర్తిగా వెలసిపోయాయి. మంచినీటి కోసం ఏర్పాటు చేసిన ట్యాంకులు పగిలిపోయాయి. విద్యుత్ లైన్లు కూడా చెడిపోయాయి. వీటికి తిరిగి మరమ్మతులు చేపట్టేదెప్పుడో.. మాకు అందజేసేదెప్పుడో.. అని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇళ్లు మంజూరు కాకపోవడంతో తాము మాత్రం అద్దె ఇంట్లోనే కాలం గడపాల్సి వస్తోందని వాపోతున్నారు.

**లబ్ధిదారుల సంఖ్య అధికంగా ఉన్నందుకే..**

కీసరలో లబ్ధిదారుల సంఖ్య అధికంగా ఉన్నందున రెండో విడతలో భాగంగా ప్రస్తుతం నిర్మించిన గృహ సముదాయాల పక్కనే మరో 36 డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణాలు చేపట్టడం జరుగుతుందని, ఆ నిర్మాణాలు పూర్తయిన తర్వాత లబ్ధిదారులకు ఇళ్లు పంపిణీ చేస్తామని ఇప్పటి వరకు అధికారులు చెబుతూ వస్తున్నారు. కాగా ఇప్పటి వరకు ఇళ్ల పంపిణీ చేయకపోవడంతో ఇటీవల తీవ్ర విమర్శలు రావడంతో పూర్తయిన ఇళ్లను పంపిణీ చేయాలని అధికారులు నిర్ణయించారు. ఇప్పటికైనా అధికారులు, మంత్రి మల్లారెడ్డి స్పందించి వీలైనంత త్వరగా నాలుగేళ్ల క్రితం నిర్మాణాలు పూర్తయ్యి శిథిలావస్థకు చేరుకుంటున్న డబుల్ బెడ్రూం ఇళ్ల గృహ సముదాయలకు మరమ్మతులు చేపట్టడంతో పాటు కొత్తగా నిర్మిస్తున్న గృహ సముదాయాన్ని పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేయాలని డిమాండ్ చేస్తున్నారు.


ఇటీవల యాద్గార్‌పల్లిలో 'డబుల్' ఇళ్ల వద్ద నెలకొన్న సమస్యలను అక్కడి ప్రజల ద్వారా తెలుసుకుంటున్న అడిషనల్ కలెక్టర్ అభిషేక్ అగస్త్య

**అందించిన చోట సమస్యలెన్నో...**

పంపిణీ చేసిన గ్రామాల్లో సమస్యలతో సహవాసం చేస్తున్న లబ్ధిదారులు... యాద్గార్‌పల్లి, చీర్యాల గ్రామాల్లో నిర్మించి లబ్ధిదారులకు అందజేసిన డబుల్ బెడ్రూం ఇళ్ల సముదాయాల వద్ద సౌకర్యాలు లేక ఇళ్లలో నివాసం ఉంటున్న లబ్ధిదారులు నానా ఇక్కట్లు పడుతున్నారు. మంచినీరు, రవాణా సౌకర్యం, విద్యుత్‌స్తంభాలు, వీధి దీపాలు, సరైన డ్రైనేజీ వ్యవస్థ లేని కారణంగా ఇక్కడి ప్రజలు సమస్యల మధ్యనే కాలం వెళ్లదీస్తున్నారు. తమ సమస్యలను పరిష్కరించాలని లబ్ధిదారులు డిమాండ్ చేస్తున్నారు. కాగా గత రెండు రోజుల క్రితం జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య స్వయంగా యాద్గార్‌పల్లి డబుల్ బెడ్రూం ఇళ్ల సముదాయాలను పరిశీలించి అక్కడ నివాసం ఉంటున్న వారి నుంచి వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలను పరిష్కరించాలని కాలనీవాసులు ఆయనకు విన్నవించారు.

**లబ్ధిదారులకు పంపిణీ చేయాలి**



కీసరలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లకు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టి గ్రామంలో నిజమైన నిరుపేద లబ్ధిదారులకు పంపిణీ చేయాలి.

– బండారి శ్రీనివాస్‌రెడ్డి, కీసర

# అధికారం ఆమెది.. పెత్తనం పెనివిటిది!

**సర్పంచ్ సీట్లో ఆమె భర్త హల్‌చల్**


పంచాయతీ ఆఫీసులోని సర్పంచ్ సీట్లో కూర్చున్న సర్పంచ్ వెన్నెల భర్త రామకృష్ణుడు (సర్కిల్‌లో..)

మేడ్చల్: అధికార దుర్వినియోగంపై జిల్లా కలెక్టర్ సస్పెండ్ చేసిన సర్పంచ్ ఆమె హైకోర్టు ఆదేశాలతో తిరిగి ఆరు నెలల తర్వాత సర్పంచ్ పదవి పొందినా అధికార దుర్వినియోగం మాత్రం ఆగడం లేదు. మండలంలోని ఎల్లంపేట్ గ్రామ సర్పంచ్ వెన్నెల తీరిది. గ్రామంలో సర్పంచ్ వెన్నెల అయినప్పటికీ పెత్తనం ఆమె భర్త రామకృష్ణుడు సాగిస్తున్నాడు. సాధారణంగా మహిళలు ప్రజాప్రతినిధులు ఉన్న చోట వారి భర్తో.. కుమారుడో.. తెర వెనుక ఉండి అన్ని పనులు చక్కబెడతారు. రామకృష్ణుడు మాత్రం తన భార్యకు ఉన్న అధికారంను తానే తీసుకుని పూర్తిగా అధికార దుర్వినియోగం చేస్తున్నాడు. గతంలో గ్రామ కంఠం భూములను ప్లాట్లుగా చేసి సర్పంచ్ సంతకాలతో సర్టిఫికెట్లు జారీ చేసి విచారణలో సస్పెండ్ అయిన ఘటన విధితమే. తాజాగా ఆయన గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏకంగా సర్పంచ్ సీట్లోనే కూర్చుని అన్నీ తానై నడిపిస్తున్నాడు. సన్మానాలు చేసుకుంటూ తానే సర్పంచ్‌గా వ్యవహరిస్తున్న ఫోటోలను గ్రామానికి చెందిన యువకుడు ఫోన్‌లో చిత్రీకరించాడు. ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. కాగా ఈ ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది.

### బాలగోనికి పురస్కారం




పోచారం: మున్సిపాలిటీలోని 10వ వార్డు కౌన్సిలర్ బాలగోని వెంకటేశ్ గౌడ్‌కు స్వామి వివేకానంద జీవిత సాఫల్య పురస్కారం లభించింది. రాజకీయ రంగంలో బాలగోని చేసిన సేవలను గుర్తించి అవార్డును ప్రదానం చేశారు. నగరంలో జరిగిన కార్యక్రమంలో ఇరిగేషన్ శాఖ చైర్మన్ వేణుగోపాలచారి చేతుల మీదగా అవార్డును అందుకున్నారు.

### విరాళంగా తాలిబొట్లు అందజేత

కీసర: నాగారం మున్సిపాలిటీ ఈస్ట్‌గాంధీనగర్ కాలనీలో గల శ్రీవల్లీ దేవసేన అమ్మవార్ల దేవాలయానికి ఈసీఐఎల్ ప్రాంతానికి చెందిన చిల్లా నాగేశ్వరరావు, వసంతలక్ష్మీ దంపతులు సుమారు రూ.2.10లక్షల విలువ చేసే బంగారు తాలిబొట్లు విరాళంగా అందజేశారు. ఈమేరకు ఆదివారం దేవాలయం వద్ద కౌన్సిలర్ మాదిరెడ్డి వెంకట్‌రెడ్డికి బంగారు తాలిబొట్లను అందజేశారు.



# 'మంత్రి మల్లారెడ్డి శిలాఫలకాలకే పరిమితం'


బీజేపీ కార్నర్ మీటింగ్ మాట్లాడుతున్న మాధవి


కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న ప్రదీప్‌కుమార్

మేడ్చల్‌రూరల్: సీఎం కేసీఆర్ ఫాంహౌస్, ప్రగతిభవన్‌లకు పరిమితమైతే.. మంత్రి మల్లారెడ్డి కేవలం శిలాఫలకాలకే పరిమితం అయ్యాడని, నియోజకవర్గంలో ఎక్కడా అభివృద్ధి జరగలేదని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి మాధవి విమర్శించారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి లక్ష్మీనగర్‌లో 'ప్రజాగోస–బీజేపీ భరోసా' కార్నర్ మీటింగ్ నిర్వహించారు. సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడుతూ.. ఉప ఎన్నికలు వస్తేనే నియోజకవర్గాలు అభివృద్ధి జరుగుతున్నాయని, కాబట్టి స్థానిక ఎమ్మెల్యే అయిన మంత్రి మల్లారెడ్డి రాజీనామా చేసేలా ఒత్తిడి తేవాలని తెలిపారు. ఎన్నికలు ఎప్పుడు జరిగినా బీజేపీ గెలుపు ఖాయమని దీమా వ్యక్తం చేశా రు. అసెంబ్లీ కన్వీనర్ మోహన్‌రెడ్డి, బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు శ్రీనివాస్, కౌన్సిలర్లు అమరం సరస్వతి, హంసరాణి, నాయకులు కృష్ణాగౌడ్ మహేశ్, అనిల్, అర్జున్, నాగరాజు, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

**గోధుమకుంట గ్రామంలో...**

కీసర: రాష్ట్రంలో బీఆర్ఎస్ పాలనలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకోవడంతో పాటు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకే బీజేపీ ఆధ్వర్యంలో 'ప్రజాగోస–బీజేపీ భరోసా' స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లను నిర్వహించడం జరుగుతుందని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్ కుమార్ అన్నారు. గోధుమకుంట గ్రామంలో బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన స్ట్రీట్ మీటింగ్‌లో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో శక్తి కేంద్రం ఇన్‌చార్జి కోల బాల్‌రాజ్, జిల్లాల తిరుమల్‌రెడ్డి, దేశం మల్లేష్‌గౌడ్, వంగేటి బాపిరెడ్డి, కొలిచెలిమి కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా కొనసాగుతున్న ఉత్సవాలు


పల్లకిలో ఊరేగుతున్న రామలింగేశ్వరుడు

మేడ్చల్: మేడ్చల్ దాక్షాయని సమేత శ్రీరామలింగేశ్వర స్వామి కల్యాణోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మూడో రోజైన ఆదివారం స్వామి వారిని అశ్వవాహనంపై పట్టణ ప్రధాన వీధుల్లో ఊరేగించారు. శనివారం రాత్రి భృంగీశ్వర సేవ నిర్వహించారు. ఆలయంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ రకాల విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించి సాయంత్రం వివిధ రకాల వాహన సేవలను నిర్వహిస్తున్నారు.

### ఆర్టీసీ కాలనీలో ఘనంగా బోనాలు

మేడ్చల్: పట్టణంలోని ఆర్టీసీ కాలనీలో కట్టమైసమ్మ ఆలయం నూతనంగా నిర్మించి అమ్మవారిని ప్రతిష్ఠించిన సందర్భంగా కాలనీ వాసులు ఆదివారం బోనాల పండగను ఘనంగా జరుపుకున్నారు. ప్రతిష్ఠ ఉత్సవాలు ముగియడంతో ఆదివారం భక్తిశ్రద్ధలతో బోనాలను ఇళ్లల్లో తయారు చేసుకుని ఊరేగింపుగా వెళ్లి ఆలయంలో అమ్మవారికి సమర్పించారు. దీంతో భక్తులతో నూతన ఆలయ ప్రాంగణం రద్దీగా కనిపించింది.


అమ్మవారికి బోనాలు ఊరేగింపుగా తీసుకెళ్తున్న మహిళలు

# శ్రీనివాస్‌రెడ్డి అంత్యక్రియలు పూర్తి

## పాల్గొని నివాళులర్పించిన పలువురు ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు

మేడ్చల్: అనారోగ్యంతో మరణించిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఎర్రవల్లి శ్రీనివాస్‌రెడ్డి అంత్యక్రియలు ఆదివారం ముగిశాయి. ఆయన మృతి పట్ల ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు సంతాపం తెలిపి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. ఆదివారం డబీల్‌పూర్‌లో అంత్యక్రియలు నిర్వహించగా కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్‌రావు, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్, మేడ్చల్ మాజీ ఎమ్మెల్యేలు లక్ష్మారెడ్డి, సుధీర్‌రెడ్డి, వివిధ పార్టీ నేతలు నక్క ప్రభాకర్‌గౌడ్, రాజమల్లారెడ్డిలు ఆయన భౌతికకాయం వద్ద నివాళులు అర్పించి అంత్యక్రియల్లో పాల్గొన్నారు.


శ్రీనివాస్‌రెడ్డి పార్థీవదేహం వద్ద నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే మైనంపల్లి


నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే కేపీస వివేకానంద్


నివాళులు అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్


నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యేలు కూన శ్రీశైలంగౌడ్, సుధీర్‌రెడ్డి